ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
మంగళవారం 31 డిసెంబరు 2024



మరమ్మతులకు నోచుకోని చేతిపంపులు



వేమునూర్ గ్రామంలో పాడైపోయిన చేతిపంపు

పాలకుర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వేమునూర్‌లో చేతిపంపులు మరమ్మతులకు నోచుకోక అలంకారప్రాయంగా మారాయి. గ్రామస్థుల దాహాన్ని తీర్చేందుకు 20 పైగా చేతిపంపులను ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల తర్వాత సగానికి పైగా చేతిపంపులు మర్మతులకు రావడంతో అప్పటి గ్రామపంచాయతీ పాలకవర్గం కానీ, ప్రభుత్వ అధికారులు కానీ పట్టించుకోలేదు. దీంతో లక్షలు వెచ్చించి వేసిన చేతిపంపులు నిరుపయోగంగా మారాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చేతి పంపులకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

నిందితులను కఠినంగా శిక్షించాలి

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలో ప్రభుత్వపాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అయ్యప్పమాల వేసుకున్న ఓ విద్యార్థిని తరగతిగదిలో నిలబెట్టాడని రాములుపై దాడి చేయడం సరి కాదని, అంతేకాకుండా ప్రధానోపాధ్యాయుడు రాములుతో విద్యార్థి కాళ్లు మొక్కించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు.

నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని నాణ్యమైనవి అందించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శ మార్కపురి సూర్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆహార భద్రత కార్డుదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న బియ్యం నాణ్యత లేకుండా పోయిందని, ప్రజలు తినలేక పోతున్నారని పేర్కొన్నారు. సివిల్‌సప్లై అధికారులు నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలన్నారు. లేకపోతే సివిల్ సప్లై కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

గీత కార్మికుడికి గాయాలు

ముత్తారం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన పందాల సాయిలు గౌడ్ చెరువు కట్టపై ఈత చెట్టు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తోటి గీత కార్మికులు పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు.

విస్తరణ బాటలో ఎన్టీపీసీ

- 800 మెగావాట్ల యూనిట్ ప్రారంభం
- 2400 స్టేజ్ 2కు లైన్ క్లియర్
- రామగుండం ప్లాంటుకు అవార్డుల పంట



జ్యోతినగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీ 2024లో విస్తరణ వైపు అడుగులు వేసింది. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని 800 మగావాట్ల 2వ యూనిట్ ఈ ఏడాది ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ సంవత్సరం మార్చి 4న 2వ యూనిట్‌ను కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్‌గా గుర్తించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నిజామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వర్చువల్ విధానంలో యూనిట్‌ను జాతికి అంకితం చేశారు. టీఎస్‌టీపీపీ స్టేజ్ 1లో భాగంగా 800 మెగావాట్ల 2 యూనిట్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. స్టేజ్ 1ను 10వేల కోట్ల రూపాయలతో నిర్మించారు. విస్తరణలో భాగంగా మిగిలిన 2400 మెగావాట్ల (800 మెగావాట్ల 3 యూనిట్లు) ప్రాజెక్టుకు సంబం ధించి నిర్మాణానికి ఎన్టీపీసీ యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది. రెండో దశకు సంబంధించి 29,349 కోట్ల రూపాయల నిర్మాణ వ్యయాన్ని ఎన్టీపీసీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఆమోదించారు. ప్రాజెక్టు పర్యావరణ అనుమతి కోసం ప్రజాభిప్రాయ సేకరణ జరిపేందుకు ఏర్పాట్లు చేసింది. అయితే కొన్ని సాంకే తిక కారణాల వల్ల పబ్లిక్ హియరింగ్ వాయిదా పడంది. ఈ ప్రాజెక్టు విష యంలో 800మెగావాట్ల కోసం తెలం గాణ ప్రభుత్వంతో పీపీఏ కదుర్చు కునేందుకు కేబినేట్ ఆమోదం తెలిపి నట్టు సమాచారం.



టీఎస్‌టీపీపీ స్టేజ్ 1 ప్రాజెక్టు

రామగుండం ఎన్టీపీసీ

● సోలార్ విద్యుత్ విస్తరణ..

ఈ ఏడాది సోలార్ విద్యుత్ విస్తరణకు అంకురార్పణ జరిగింది. ఎన్టీపీసీ ఆధ్వ ర్యంలో ఇప్పటికే 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఎన్టీపీసీ మరో 176 మెగావాట్ల సోలార్ విద్యుత్ విస్తరణకు ఏర్పా ట్లు చేసింది. ఎన్టీపీసీ రిజర్వాయర్లో 56 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్‌తోపాటు సర్ఫేస్(నేల)పై 120 మెగావాట్ల సౌర విద్యుత్

మిగతా 6వ పేజీలో...

ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు

- రామగుండం సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రశాంత వాతావరణంలో నూతన సంతవ్సర వేడుకలు జరుపుకోవాలని రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా వేడుకలు నిర్వహించుకోవాలని, ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కమిషనరేట్‌లోని అన్ని ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారని, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, క్రైమ్, షీటీమ్స్, మఫ్టీటీములు, ఎస్‌బీ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని, ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. 12.30గంటలలోపు వేడుకలు ముగించాలన్నారు. వేడుకల్లో సాంస్కృతిక కార్యకలాపాలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, అశ్లీల నృత్యాలకు అనుమతిలేదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించరాదన్నారు. ఆర్కెస్ట్రా, డీజేలు, బాణా సంచా నిషేధమన్నారు. 31వ తేది రాత్రి 10గంటల నుంచి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని, మద్యం మత్తులో వేగంగా వాహనాలు నడపడం, రోడ్లపై వెళ్లేవారిని ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవన్నారు.

వాహనాల పాత సామగ్రి బహిరంగ వేలం...

కోల్‌సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ వాహనాల పాత స్పేర్ పార్ట్‌లు, టైర్లు, బ్యాటరీలు, ఉపయోగించిన ఇంజన్ ఆయిల్‌ను జనవరి 3న కమిషనరేట్ హెడ్ క్వార్టర్‌లో వేలం వేయనున్నట్టు అడిషనల్ డీసీపీ(అడ్మిన్)సీ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాకు చెందిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాచారం కోసం ఎంటీవో సంపత్ 87126566162నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బస్ డిపోకు స్థలాన్ని అప్పగించేందుకు కసరత్తు

- జనవరి 10లోపు కార్యాలయాలు ఖాళీ చేయాలని కలెక్టర్ ఆదేశాలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్ల పరిశీలనలో అధికారులు
- స్థలం స్వాధీనమైన వెంటనే డిపో పనులు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లికి మంజూరైన ఆర్టీసీ బసు డిపోకు స్థలాన్ని అప్పగించేందుకు జిల్లా కలెక్టర్ కసరత్తు చేస్తున్నారు. బస్టాండ్ సమీపంలో గల స్థలంలో గల వివిధ ప్రభుత్వ కార్యాలయాలను పది రోజుల్లో ఖాళీ చేసి మరోచోట ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి ఆదేశించారు. దీంతో ఆయా శాఖల కార్యాలయాల అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. పెద్దపల్లిలో బస్ డిపో ఏర్పాటుచేయాలనే చిరకాల వాంఛ నెరవేరనున్న విషయం తెలిసిందే. బస్ డిపోకు 4.31 ఎకరాల భూమిని కేటాయిస్తూ సెప్టెంబర్ 26న తేదీన కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రొసీడింగ్స్ నంబర్. ఈ1/1629/2024 ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు సర్వే నంబర్ 592లో 36 గుంటల స్థలంలోగల సివిల్‌సప్లయ్ గోదాం, సర్వే నంబర్ 589లో 6గుంటల స్థలంలోగల ఎంపీడీఓ, 7 గుంటల్లోగల ఎంఈవో, 7 గుంటల్లోగల డీఆర్‌డీఏ ఆఫీసులు, 3 గుంటల్లో గల సివిల్ సప్లయ్ కార్యాలయం, 4 గుంటల్లో గల పాడి రైతు శిక్షణ కేంద్రం, 12 గుంటల్లోగల జిల్లా లీగల్ మెట్రాలజీ కార్యాలయం, 14 గుంటల్లో గల మిల్క్ యూనిట్ కార్యాలయం, 5గుంటల్లోగల ఎక్సైజ్ కార్యాలయం, 18 గుంటల్లో గల పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం, 3 గుంటల్లోగల డీఎల్‌పీవో కార్యాలయం, ఎకరం 36 గుంటల ఖాళీ స్థలాన్ని బస్ డిపో కోసం కేటాయించారు. ఈ స్థలానికి ధరణి పోర్టల్ ప్రకారం ఎకరానికి 2 కోట్ల 83 లక్షల 14 వేల రూపాయలు ఉండగా, మొత్తం 14 కోట్ల 15 లక్షల 70వేల రూపాయలు చెల్లిస్తే స్థలాన్ని అప్పగించనున్నట్లు జిల్లా కలెక్టర్ టీఎస్‌ఆర్టీసీ ఎండీకి లేఖ రాశారు. ఈనెల 4వ తేదిన పెద్దపల్లిలో జరిగిన యువవికాసం సీఎం సభకు ఒక రోజు ముందే ఆర్టీసీ డిపోకు ప్రభుత్వం ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఉచితంగా అందజేయనున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభా వేదిక నుంచి వర్చువల్‌గా పెద్దపల్లి బస్ డిపోకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నుంచి బస్ డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న చెట్లను అన్నింటిని తొలగించారు. వారం రోజుల క్రితం కరీంనగర్ రీజినల్ మేనేజర్ రాజు, తదితరులు పెద్దపల్లికి చేరుకుని బస్టాండ్‌ను, డిపోకు కేటాయించనున్న స్థలాన్ని, ఆ స్థలంలో ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. వాటిలో ఏ భవనాన్ని తొలగించాలి, తమకు అక్కరకు వచ్చేవి ఏమి ఉన్నాయో పరిశీలించారు. ఆ స్థలాన్ని ఆర్టీసీకి అప్పగించేందుకు అక్కడ ఉన్న ఎంపీడీవో, ఎంఈవో, ఎక్సైజ్ సూపరింటెండెంట్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, తదితర కార్యాలయాలను జనవరి 10వ తేదీలోపు ఖాళీ చేసి మరో చోటికి తరలించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యాలయాలు ఖాళీ అయిన తర్వాత స్థలాన్ని ఆర్టీసీ అధికారులకు అప్పగించనున్నారు. డిపోలో డీఎం కార్యాలయం, ఇతర కార్యాలయం, డీజిల్ బంకు, బస్సుల రిపేరింగ్ షెల్టర్, బస్ వాషింగ్ ప్లాంటు నిర్మించిన తర్వాత మిగతా స్థలాన్ని బస్సుల పార్కింగ్ కోసం సద్వినియోగం చేసుకోనున్నారు. కలెక్టర్ స్థలాన్ని ఆర్టీసీకి స్వాధీనపరిచిన వెంటనే ఆర్టీసీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం రంగంలోకి దిగి ఎక్కడెక్కడ ఏమి నిర్మించాలనే విషయమై ప్రణాళికలు రూపొందించనున్నారు. సివిల్ పనుల్లో భాగంగా ముందుగా కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టిన తర్వాత రిపేరింగ్ షెడ్, డీజిల్ బంకు, వాషింగ్ ప్లాంటు, రిపేరింగ్ షెడ్ నిర్మాణ పనులను చేపట్టనున్నారు.

కార్యాలయాల కోసం ప్రస్తుతం ఉన్న భవనాల్లో ఒకటి, రెండింటిని సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఉంది. సాధరణంగానైతే డిపో ప్రారంభానికి ఏడాది పట్టనున్నది. కానీ ఆరు మాసాల్లోనే పెద్దపల్లి డిపో ప్రారంభం కావాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు ఆర్టీసీ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం రోజు జూన్ 2వ తేదీ నాటికి డిపోను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

స్థలం స్వాధీనం కాగానే డిపో ఏర్పాటు పనులు ప్రారంభం

- రాజు, కరీంనగర్ ఆర్ఎం, టీజీఎస్‌ఆర్టీసీ

పెద్దపల్లి బస్ డిపో ఏర్పాటుకు ప్రభుత్వం 4.31 ఎకరాల స్థలాన్ని ఉచితంగానే కేటాయించింది. ఆ స్థలం బస్టాండ్‌కు సమీపంలోనే ఉండడం కలిసి వస్తున్నది. ఆ స్థలంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను మరోచోటికి షిఫ్టు చేసిన తర్వాత స్థలాన్ని తమకు స్వాధీనపరుస్తామని కలెక్టర్ చెప్పారు. ఆ వెంటనే సివిల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మరోసారి స్థలాన్ని పరిశీలించి ఎక్కడ ఏ నిర్మాణం చేపట్టాలో ప్రణాళికలు రూపొందిస్తాం. సాధారణంగానైతే డిపో పూర్తి కావడానికి ఏడాది సమయం పడుతుంది. అంతకంటే ముందే పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తాం.

'ఎల్లంపల్లి' భూముల పరిరక్షణకు చర్యలు 5
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పోలీస్ కమిషనరేట్‌లో తగ్గిన నేరాలు 6
- వార్షిక నేర నివేదికలో రామగుండం సీపీ శ్రీనివాస్

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై వామపక్షాల నిరసన

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం మున్సిపల్ టీజంక్షన్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నల్ల జెండాలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సందర్భంగా వామపక్షాల నాయకులు యాకయ్య, ఐ కృష్ణ, విశ్వనాథ్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో అమిత్‌షా అంబేద్కర్‌పై తప్పుడు కూతలు కూశారని, దేశంలో రాజ్యాంగానికి, ప్రజలకు ప్రమాదం ఏర్పడింది. రాజ్యాంగం రచించిన వ్యక్తిపై హోంశాఖ మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. దీనిపై ఇప్పటికీ ప్రధాని మోదీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్, చంద్రన్న, నరేష్, మహేశ్వరి, లచ్చయ్య, రాజేశ్వర్, కుమారస్వామి, రాజేందర్, దుర్గయ్య, శంకర్, రవికుమార్, నర్సయ్య, అన్వేష్, సంపత్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన కమిషనర్

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. రిసెప్షన్ సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి, వచ్చిన ఫిర్యాదులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ ట్రయల్స్‌లో ఉన్న కేసులు, గ్రేవ్ కేసులకు సంబంధించి ఫైళ్ళను పరిశీలించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి దర్యాప్తు వివరాలను సీఐ ప్రసాదరావు సీపీకి వివరించారు. స్టేషన్ పరిధలో గ్రామాల వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, రౌడీ షీటర్స్ వివరాలను తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీపీ శ్రీనివాస్ వెంట డీసీపీ చేతన, ఏసీపీ రమేష్ ఉన్నారు.

● మంథని (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా మంథని పోలీసు స్టేషన్‌కు రామగుండం సీపీ శ్రీనివాస్ సోమవారం సందర్శించి స్టేషన్ నిర్వాహణను, రికార్డులను తనిఖీ చేయడం తోపాటు సేవలను పరిశీలించారు. పోలీసు స్టేషన్ల పరిధిలో వివిధ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఫిర్యాదులు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేయటానికి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని సీపీ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, సీఐ రాజు, ఎస్ఐ రమేష్‌లు పాల్గొన్నారు.

అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టివేత

మంథని, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని మండలంలోని ఎక్లాస్‌పూర్ ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద సోమ వారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై రమేష్ తెలి పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి లారీలో 28 టన్నుల రేషన్ బియ్యాన్ని మహారాష్ట్ర తరలి స్తున్నారని, బియ్యం విలువ 10 లక్షల 92 వేల రూపాయల వరకు ఉంటుందన్నారు. లారీ డ్రైవర్ నర్రా పెద్దులు, క్లీనర్ దాసరి బాబులు కలిసి ఓనర్ కొలిపాక కిరణ్ కుమార్ చెప్పిన విధంగా మహారాష్ట్ర తరలిస్తున్నారని తెలిపారు. బియ్యాన్ని, లారీని స్వాధీనం చేసుకొని సవిల్ సప్లయీస్ అధికారులకు అప్పగించి, కేసు నమోదు చేశామని తెలిపారు. లారీని పట్టుకున్న ఎస్సై రమేష్‌తో పాటు సిబ్బందిని సీఐ రాజు అభినందించారు.

నల్ల జెండాలతో హమాలీల నిరసన

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులు కూలీ రేట్లు పెంచకుండా హమాలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎంఏ గౌస్ అన్నారు. సోమవారం గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో హమాలీలు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా హోల్‌సేల్ వ్యాపారులు స్పందించి హమాలీలకు కూలీ రేట్లు పెంచాలన్నారు. నాయకులు కండె లక్ష్మయ్య, గడ్డం రాంచందర్, గాలిపెల్లి సతీష్, జానిమియా, కొటం రవీందర్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్నకొండ ఆదిత్య, ఈదునూరి రాజు, వినయ్, సందీప్, గణేష్, నవీన్, కార్తీక్, అరవింద్ పాల్గొన్నారు

ప్రతిభావంతులైన విద్యార్థులకు తోడ్పాటు : కలెక్టర్



ఆర్చరీ క్రీడాకారుడికి కాంపౌండ్ బో అందజేస్తున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రీడలకు సంబంధించి ప్రతిభావంతులైన విద్యార్థులకు అవసరమైన తోడ్పాటు అందిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆర్చరీ క్రీడాకారుడు ధీరజ్‌రావుకు కాంపౌండ్ బో పంపిణీ చేశారు. రామగుండంకు చెందిన ధీరజ్‌రావు జాతీయస్థాయి ఆర్చరీ పోటీలలో మంచి ప్రతిభ కనబర్చిన నేపథ్యంలో తనకు కాంపౌండ్ బో కావాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తు పరిశీలించిన కలెక్టర్ విద్యార్థికి అవసరమైన కాంపౌండ్ బో కొనుగోలు చేసి సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమ్ము రోజు శ్రీనివాస్, పేట సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి సురేందర్, డి రమేష్, ధీరజ్‌రావు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

పెద్దపల్లి టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు కలెక్టరేట్‌లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన టి రమాదేవి జూలపల్లి మండలం వడ్కాపురంలోని తమ తండ్రి భూములు కబ్జాకు గురయ్యాయని, మండల ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నా పాస్ పుస్తకం రాలేదని కోరగా, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జూలపల్లి తహసీల్దార్‌ను ఆదేశించారు. మంథని మండలం అడవినాగపల్లికి చెందిన తోటపల్లి గుట్టయ్య తన తండ్రి పంట పొలాల కాసరి ఉద్యోగం వారసత్వంగా తనకు ఇప్పించాలని కోరగా, అర్హతలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ పరిపాలన అధికారిని ఆదేశించారు. రామగిరి మండలం జల్లారం గ్రామానికి చెందిన లివ్ ఫర్ క్రైస్ట్ అనే సంస్థ ఎన్‌జీవో భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరగా, పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను ఆయన ఆదేశించారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

పెద్దపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలం సీతంపేట గ్రామంలో కబ్జా గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని గ్రామస్థులు కొందరు కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సీతంపేట మాజీ సర్పంచ్ పులిపాక నగేష్, రావుల రాజుకుమార్, జక్కుల ఓదెలు అదనపు కలెక్టర్ డి వేణుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై 2022 నవంబర్ 14న అప్పటి కలెక్టర్‌కు, ఈనెల 19న స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయమై కలెక్టర్ సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని సీతంపేట మాజీ సర్పంచ్ పులిపాక నగేష్, రావుల రాజుకుమార్, జక్కుల ఓదెలు కోరారు.

క్రమశిక్షణ.. దేశభక్తి

- పేద విద్యార్థులకు వరంగా రుక్మాపూర్ సైనిక పాఠశాల
- ఆరో తరగతి నుంచే సైన్యంలో చేరేందుకు శిక్షణ
- ఉద్యోగాలు సాధించిన పలువురు విద్యార్థులు

చొప్పదండి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దేశభక్తి రగిలించి క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అందిస్తోంది రుక్మాపూర్ సైనిక పాఠశాల. చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో 2018లో ఈ పాఠశాల ఏర్పాటైంది. ఇక్కడి విద్యార్థులను ఆల్‌రౌండర్లుగా తీర్చిదిద్దుతున్నారు. సైన్యంలో చేరేందుకు అవసరమైన శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు 36మంది విద్యార్థులు ఎన్‌డీఏ పరీక్షకు అర్హత సాధించారు. ముగ్గురు విద్యార్థులు త్రివిధ దళాల్లో చేరారు. కల్నల్‌స్థాయి మిలిటరీ అధికారి నేతృత్వంలో విద్యార్థులకు శిక్షణనిస్తున్నారు. డిసెంబరు 22న ఇంటర్ విద్యార్థి సిద్ధార్థ ఎన్‌డీఏ 2024కు అర్హత సాధించి సైన్యంలో చేరాడు.



రుక్మాపూర్ సైనిక్ స్కూల్

● 2018లో ప్రారంభం

రుక్మాపూర్‌లో సాంఘిక సంక్షేమ గురుకులాన్ని 1986లో 30 ఎకరాల స్థలంలో ప్రారంభించారు. సువిశాలమైన మైదానంతో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది. 2018లో ఈ గురుకులాన్ని సైనిక పాఠశాలగా మార్చారు. అప్పటి గురుకుల సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేద విద్యార్థులను సైన్యంలో చేర్పించడమే లక్ష్యంగా గురుకులాన్ని రాష్ట్రంలో మొదటి సైనిక పాఠశాలగా మార్చారు. రిటైర్డ్ కల్నల్‌ను డైరెక్టర్‌గా నియమించి విద్యార్థులకు సైనిక శిక్షణను ఇవ్వాలని నిర్ణయించి అమలు చేశారు. ఆరోతరగతిలో రాష్ట్రస్థాయిలో ప్రవేశపరీక్ష ద్వారా పాఠశాలలో ప్రవేశం కల్పిస్తారు.



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

● 36 మంది విద్యార్థులు ఎన్‌డీఏకు అర్హత...

ఇప్పటివరకు స్కూల్‌లో శిక్షణ పొందిన 36మంది విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన ఎన్‌డీఏ పరీక్షకు అర్హత సాధించారు. ముగ్గురు విద్యార్థులు సైన్యం, ఎయిర్ ఫోర్స్‌లో చేరారు. 2022లో అశోక్ సాయి, ఉమాకాంత్ ఎయిర్ ఫోర్స్‌లో చేరగా, 2024 ఎన్‌డీఏలో రామడుగు సిద్ధార్థ ఎంపికై సైన్యంలో చేరాడు. విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తున్నారు. ఇద్దరు విద్యార్థులు జాతీయ, 86 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి బహుమతులు సాధించారు. వివిధ విభాగాల్లో క్రీడలలో విద్యార్థులు రాణిస్తున్నారు.



స్కూల్ ఆవరణలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

● విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ...

విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించడమే లక్ష్యంగా ప్రత్యేక శిక్షణను ఇస్తున్నాం. సైన్యం ఎయిర్‌ఫోర్స్, నేవీ విభాగాల్లో చేరేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. నిరంతరం శిక్షణ, వ్యాయామం, నైపుణ్యంతో విద్యార్థులు భవిష్యత్‌లో మంచి స్థానాలకు చేరుకునేలా తీర్చిదిద్దుతున్నాం.

- కేసీ రావు, స్కూల్ డైరెక్టర్



లారీ, సైకిల్ ఢీ.. దంపతులకు గాయాలు

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం మొదటి బైపాస్ రోడ్డులోని నర్సింగ్ కళాశాల వద్ద సోమవారం లారీ, సైకిల్ ఢీకొని దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. సిరిసిల్ల పట్టణం ఇందిరానగర్‌కు చెందిన గడ్డ రాజు (57), కౌసల్య (51) దంపతులు సైకిల్‌పై కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చేందుకు శాంతినగర్ నుంచి బైపాస్ రోడ్డు ఎక్కిన కొద్దిసేపటికే కోదాడ నుంచి సిద్దిపేట మీదుగా వేములవాడ వైపు వెళుతున్న లారీ అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు తలకు బలమైన గాయాలవగా కౌసల్య కాళ్లు విరిగి తీవ్రగాయలయ్యాయి. స్థానికులు వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించి అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం కౌసల్యను గాంధీ ఆసుపత్రికి, రాజును కరీంనగర్‌కు తరలించారు. ఈ దంపతులు రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ రాజు పవర్ లూమ్ కార్మికుడిగా, కూలీగా పనిచేస్తున్నాడు. కౌసల్య బీడీలు చేస్తుంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి నల్లగొండకు చెందిన లొద్య సైదులు అనే డ్రైవర్‌ను అరెస్ట్ చేశామని సీఐ కృష్ణ తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కోల్‌సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాత్రిపూట బయట తిరగవద్దని, బాగా చదువుకోవాలని తల్లి మందలించినందుకు గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థి ముక్క రోహక్(16) ఆదివారం రాత్రి ఇంటి పెంట్‌హౌస్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న రోహక్ కాలేజీకి సరిగా వెళ్లేవాడు కాదని, బయట తిరుగుతూ రాత్రికి వచ్చేవాడని, శనివారం కూడా అదే విధంగా ఇంటికి రాగా రోహక్ తల్లి రమాదేవి మందలించినట్టు పోలీసులు తెలిపారు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి తండ్రి ఉత్తరప్రదేశ్‌లో సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకింద పడి గుర్తు తెలియని యువకుడి మృతి

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గూడ్స్ రైలు కింద పడి ఓ గుర్తు తెలియని యువకుడు (35) ఆదివారం రాత్రి మృత్యువాత పడ్డాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో మోసం యువకుడి ఆత్మహత్య

వీణవంక, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలన్న ఆశతో ఓ యువకుడు ఆన్‌లైన్ ట్రేడింగ్ స్టాక్ మార్కెట్‌లో డబ్బులు పెట్టి మోసపోయాడు. డబ్బులను పోగొట్టుకోవడంతో ఇంట్లో తెలిస్తే ఏం చేస్తారోనన్న భయంతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీణవంక మండలం బేతిగల్‌కు చెందిన గుమ్మడి సృజన-ఉమాల పెద్ద కుమారుడు గుమ్మడి రిషివర్ధన్(18) కరీంనగర్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంట్లో తెలియకుండా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.2లక్షలు పెట్టి మోసపోయాడు. మనోవేదనతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫర్నిచర్ ధ్వంసం





దుర్శేడ్ ప్రాథమిక పాఠశాలలో ధ్వంసమైన ఫర్నిచర్

కరీంనగర్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఫర్నిచర్‌ను దుండగులు ధ్వంసం చేశారు. పాఠశాలలోని మంచి నీటి పైపులైన్, బెంచీలను విరగకొట్టడమే కాకుండా, కిటికీలు, డోర్‌లు ధ్వంసం చేశారు. గదులకు ఉన్న విద్యుత్ స్విచ్ బోర్డులను పగులగొట్టారు. ఆదివారం కొందరు వ్యక్తులు స్కూల్‌లో మద్యం సేవించి ఆ మత్తులో ఫర్నిచర్‌ను ధ్వంసం చేసినట్టు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్కూల్‌లో లభించిన వస్తువు లను బట్టి అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరిగినట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అనారోగ్యంతో జీవిత ఖైదీ మృతి

● పోలీసు పహారా మధ్య అంత్యక్రియలు

రాయికల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మపల్లి గ్రామానికి చెందిన పుల్ల లస్మయ్య (60) అనే జీవిత ఖైదీ అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం స్వగ్రామంలో పోలీస్ పహారా మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. 2019, జనవరి 19న పుల్ల లస్మయ్య, అతని భార్య పుల్ల గంగవ్వ, కుమారుడు పుల్ల మహేష్ భూతగాదాల నేపథ్యంలో పుల్ల గంగమల్లయ్య, అతని తండ్రి పుల్ల పోచాలుపై దాడి చేశారు. ఈ దాడిలో చికిత్స పొందుతూ గంగమల్లయ్య మృతి చెందాడు. గంగమల్లయ్య భార్య పుల్ల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయికల్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. అప్పటి జగిత్యాల రూరల్ సీఐ ఎస్ రాజేష్ కేసు దర్యాప్తు చేయగా, కోర్టు విధుల పోలీసులు ఎం కిరణ్‌కుమార్, జి.రామకృష్ణ సాక్ష్యాధారాలు సమర్పించగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె.మల్లిఖార్జున్ ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. నేరం ఋజువైనందున నిందితులు పుల్ల లస్మయ్య, పుల్ల మహేష్, పుల్ల గంగవ్వకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రెండు వేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తీర్పు ఇచ్చారు. దీంతో వీరిని డిసెంబరు 29, 2023 రోజున హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు. పుల్ల లక్ష్మయ్య ఆరోగ్యం బాగా లేకపోవడంతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీంతో అతని మృతదేహంతో పాటు కొడుకు మహేష్, భార్య గంగవ్వలను పోలీసులు స్వగ్రామానికి తరలించారు. సోమవారం పోలీస్ పహారా మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం భార్య గంగమ్మ, కుమారుడు మహేష్‌ను తిరిగి జైలుకు తరలించారు.

మద్యం మత్తులో తండ్రిని చంపిన తనయుడు



శంకరయ్య(ఫైల్)

పాలకుర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని రామారావుపల్లి గ్రామానికి చెందిన సందవేని శంకరయ్య (61) కేశోరాం సిమెంటు కంపెనీ మైన్స్ విభాగంలో పనిచేసి పదవీ విరమణ పొందాడు. మద్యం సేవిస్తూ జులాయిగా తిరుగుతున్న కుమారుడు రమేష్‌ను ఆయన సోమవారం సాయంత్రం మందలించాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మద్యం సేవించి ఉన్న రమేష్ గొడ్డలితో తండ్రిని చంపాడు. నిందితుడు రమేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శంకరయ్యకు భార్య గట్టమ్మ, కూతురు ఉన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని వినతి

భగత్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) నాయకులు వినతిపత్రం అందించారు. కరీంనగర్‌లో వేలాది మంది కార్మికులు ఈఎస్ఐ కార్డుదారులు ఉన్నారని, ఆసుపత్రి ఏర్పాటుతో వారికి ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు పప్పుల సురేష్, పసుల శ్రవణ్, తొర్తి శ్రీనివాస్, నక్క అరుణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో రాణించాలి

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఖోఖో క్రీడలో రాష్ట్ర స్థాయిలో రాణించాలని జ్యోతిబాపూలే పాఠశాలల ఆర్‌సీవో అంజలి అన్నారు. తిమ్మాపూర్ జ్యోతిబాపూలే పాఠశాల మైదానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్టు శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు, పీడీ వై వసంత, వి శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

క్వారీలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

శంకరపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టులోని ఓ గ్రానైట్ క్వారీలో ఆదివారం సాయంత్రం ఎక్స్‌కావేటర్ మీద బండరాయి పడడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. కొత్తగట్టు గ్రామ శివారులోని గ్లోబల్ గ్రానైట్ క్వారీలో ఎక్స్‌కావేటర్‌తో గ్రానైట్ బండలను జరుపుతుండగా పైనున్న బండరాయి ఎక్స్‌కావేటర్ మీద పడడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

గీత కార్మికుడికి గాయాలు

రామడుగు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్ సోమవారం తాటి చెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. శ్రీనివాస్‌గౌడ్ కల్లుతీస్తున్న క్రమంలో మోకు జారటంతో కిందపడ్డాడు. దీంతో కాళ్లు, చేతులు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ బస్ డిపో క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ పరిధిలోని ఇప్పల నర్సింగాపూర్ చెందిన శ్రీనివాస్, ధర్మరాజుపల్లెకు చెందిన రాజేందర్ ద్విచక్ర వాహనంపై సోమవారం రాత్రి వెళుతుండగా హుజూరాబాద్ బస్ డిపో క్రాస్ వద్ద అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో శ్రీనివాస్, రాజేందర్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇద్దరిని హుజూరాబాద్ ఆసుపత్రికి తరలించారు.

రంగరావుపేటలో చిరుతపులి కలకలం

● కుక్కలపై దాడి చేసింది చిరుతేనని అనుమానం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగరావుపేట గ్రామ శివారులోని అటవీ భూమి సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద చిరుతపులి సంచారం ప్రజల గుండెల్లో దడపుట్టిస్తోంది. గ్రామ శివారులోని అటవీ భూమి సమీపంలో మొక్కజొన్న పంట వద్ద కట్టేసిన కుక్కలపై వరుసగా మూడు రోజుల నుంచి దాడులతో గ్రామస్థులకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. గ్రామ శివారులోని తాతమ్మ గుడి సమీపంలో కట్టేసిన రెండు కుక్కలపై దాడి చేసి ఒకదాని ఎత్తుకెళ్లగా మరొక దాని కళేబరాన్ని వదిలిపెట్టింది. వదిలిన కళేబరాన్ని మళ్లీ ఆదివారం రాత్రిలో తిన్నట్టు గ్రామస్థులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సోమవారం ఉదయం మెట్‌పల్లి రేంజర్ ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో పద్మారావు, సెక్షన్ అధికారి చైతన్యశ్రీ పోలీసు అధికారులతో కలిసి ఘటన స్థలాన్ని సందర్శించి కుక్కలను చంపింది పులి కావచ్చనని అనుమానం వ్యక్తం చేశారు. పదిరోజుల క్రితం దేవతలకుంట కేసీఆర్ తండాకు చెందిన గొర్రెను ఎత్తు కెళ్తుండగా కాపరి చూసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఎనిమిది రోజుల క్రితం ఎడ్లగాండ్ల లుద్ది వద్ద చిరుత కనిపించిందని గ్రామానికి చెందిన ఎల్ల నర్సయ్య తెలుపడంతో చిరుత ఆచూకీ కనుగొనేందుకు చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతంలో పరిశీలన చేపట్టడంతో పులి అడుగులు, గుర్తులను అధికారుల పరిశీలించి చిరుతవిగా నిర్ధారణకు వచ్చారు. చిరుత పులి సంచరిస్తున్నట్లు తెలియడంతో రైతులు, గొర్రెలు, పశు పెంపకందారులు సమీప అటవీప్రాంతంలోకి వెళ్లడానికి ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ పొలాల వద్ద కుక్కలను కట్టివేయవద్దని సూచించారు. నిజామాబాద్ జిల్లా సరిహద్దులైన కోనాపూర్ అడవుల నుంచి సంచరిస్తూ చిరుతపులి వచ్చి ఉంటుందని, ఎప్పుడు ఒక్కచోట ఉండదని ఎవరూ భయాందోళనకు గురికావద్దని సూచించారు. సమీప గ్రామప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులతో ఎవరూ అడవుల్లోకి వెళ్లవద్దంటూ హెచ్చరికలు చేశారు. పొలం పనులకు వెళ్లేవారు ఒంటరిగా కాకుండా గుంపుగానే వెళ్లాలని, ఉదయం తొమ్మిది గంటల తర్వాత వెళ్లి సాయంత్రం ఐదు గంటలలోపు తిరిగి వచ్చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, అటవీశాఖ అధికారులు శ్రీనివాస్, శివరాజ్, సత్తార్ పాల్గొన్నారు.



చిరుతపులి గుర్తులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో పద్మారావు

బైక్ ఇవ్వలేదని విద్యార్థి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తండ్రిని బైక్ అడిగితే ఇవ్వలేదని మనస్థాపంతో ఐటీఐ విద్యార్థి కొండిల్ల సాయి అవినాష్(20) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోతనకాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు శ్రీనివాస్ 33వ బ్లాక్‌లో నివసిస్తున్నాడు. శ్రీనివాస్ పెద్దకుమారుడు సాయిఅవినాష్ మందమర్రిలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో చదువుతున్నాడు. శనివారం ఇంటికి వచ్చిన సాయిఅవినాష్ రాత్రి బయటకు వెళ్లానని బైక్ కావాలని తండ్రి శ్రీనివాస్‌ను అడిగాడు. రాత్రిపూట బైక్ వద్దని తండ్రి మందలించడంతో మనస్థాపంతో గదిలో పడుకున్నాడు. సోమవారం ఉదయం చూడగా బెడ్‌షీట్‌తో ఉరివేసుకుని ఉండడాన్ని తల్లిదండ్రులు గమనించారు. సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే సాయిఅవినాష్ మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

కథలాపూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోసానిపేట శివారులో ఆదివారం రాత్రి కారు ఢీకొట్టిన ఘటనలో పోతారం గ్రామానికి చెందిన నాగెల్లి మల్లయ్య (60) అనే వృద్ధుడు మృతి చెందాడు. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం...మల్లయ్య కథలాపూర్‌లో తన పనులు ముగించుకుని స్వగ్రామం పోతారం వెళ్తున్న క్రమంలో వెనక వైపు నుంచి మాచర్ల మహేశ్ అనే డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా కారు నడిపి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కథలాపూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండకు చెందిన పొన్నం ప్రసాద్ (40) అనే వ్యక్తి జీవితంపై విరక్తి చెంది 15 రోజుల క్రితం పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిన ప్రసాద్ అక్కడ కంపెనీలో సరైన పని లేకపోవడంతో ఇంటికి తిరిగి వచ్చాడు. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా ఆర్థిక ఇబ్బందులతో కూతురు వివాహం చేయని పరిస్థితి ఉందని కలతచెంది 15 రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

మెట్‌పల్లిటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమైన ముగ్గురు నిందితులను మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన భైరి లక్ష్మీనర్సయ్య అనే వ్యక్తి గ్రామ శివారులో తనకు ఉన్న పొలంలోకి అడవి పందులు రాకుండా పక్కనే ఉన్న మామిడి తోటలో అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులతో కరెంట్ పెట్టించి ఉంచగా అందులో ఒకరు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మరొకరు కేసు భయంతో ఆత్మహత్య చేసుకోని మృతి చెందాడు. కరెంట్ పెట్టించి మృతికి కారణమైన భైరి లక్ష్మీనర్సయ్య, జంగిటి పెద్ద నర్సయ్య, మరో బాలుడిని గుర్తించి సోమవారం గ్రామంలో విచారించగా నేరం ఒప్పుకోవడంతో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

పెగడపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన బొమ్మెన రాజయ్య (46) అను వ్యక్తి అనారోగ్యంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బొమ్మెన రాజయ్య అనారోగ్య సమస్యల వల్ల జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు గమనించి కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ రవికిరణ్ తెలిపారు.

హత్య కేసులో జీవిత ఖైదు, జరిమానా

జగిత్యాల క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదుతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి ఎర్దండికి చెందిన బార్లపాటి రాజేశ్వర్, అదే గ్రామానికి చెందిన బెల్లాల అలియాస్ పల్లె పోశెట్టికి మధ్య పాత కక్షలు ఉన్నాయి. వీటిని మనసులో పెట్టుకుని ఒంటరిగా ఉన్న రాజేశ్వర్‌ను ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో పోశెట్టి 2021వ సంవత్సరంలో తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా పొడిచి దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలైన రాజేశ్వర్‌ను మెట్‌పెల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడు రాజేశ్వర్ భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శ్రీను, ఎస్సై వెంకట్‌రావు, కోర్టు డ్యూటీ అధికారులు రంజిత్, కిరణ్ కుమార్ సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లికార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి పోశెట్టికి జీవిత ఖైదుతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

వసూళ్లకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

తంగళ్లపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రేమ జంట వద్ద పోలీసుల పేరు చెప్పి వసూళ్లకు పాల్పడ్డ తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీకి చెందిన మధుకర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. పెళ్లి చేసుకున్న ప్రేమ జంటకు పెద్దమనిషిగా వ్యవహరిస్తూ పోలీసులకు రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో మధుకర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

వ్యవసాయ బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

రాయికల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ గ్రామంలో టైలరింగ్ చేసుకుంటూ జీవిస్తున్న మద్దెల జలందర్(40) అనే వ్యక్తి గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన జలందర్ నాలుగు సంవత్సరాల నుంచి అల్లీపూర్‌లో టైలరింగ్ చేసుకుంటూ జీవిస్తున్నాడు. మద్యానికి బానిసై ఒంటరితనం భరించలేక గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకున్నట్లు రాయికల్ ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

తప్పుడు పత్రాల కేసులో మరొకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో మరో నిందితుడిని కొత్తపల్లి పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ డాక్యుమెంట్లు, సాక్ష్యాలతో ఒకరం భూమిని కాజేసిన కేసులో ప్రధాన నిందితుడు అయిన కరీంనగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ అజీజ్‌ను శనివారం అరెస్టు చేసిన విషయం విదితమే. ఈ కేసులో నలుగురు నిందితులుండగా మరో నిందితుడైన కాపువాడకు చెందిన గణపతిని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు. గణపతిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

రామడుగు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పరస్పరం దాడి చేసుకున్న ఇరువర్గాలపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన నిమ్మనవేని సురేష్, పండుగ శ్రీనివాస్, సందీప్, రాణిపూర్ గ్రామానికి చెందిన పోరెడ్డి రాహుల్‌రెడ్డి, ఓరుగంటి అన్వేష్‌రెడ్డి, వినయ్‌రెడ్డి అనే యువకులు ఒకరికొకరు కర్రలతో దాడి చేసుకున్నారు. సంఘటనపై ఇరు వర్గాల నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

రామగిరి డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో హుండీ చోరీకి గురైనట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. గ్రిల్స్ తాళం పగల గొట్టి ఉండడంతో గమనించిన స్థానికులు హుండీ పగిలిపోయి ఉండడాన్ని గమనించారు. చోరీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

డీఈఈ సెట్‌లో మూడవ దశ ప్రవేశాలకు అవకాశం

తిమ్మాపూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డీఈఈ సెట్‌లో ఉత్తీర్ణులై ఇప్పటికీ సీటు రాని అభ్యర్థుల కోసం మూడో దశ ప్రవేశాలకు ఆప్షన్ పెట్టుకోవచ్చని ఎల్ఎండీ డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2 నుంచి 4 వరకు ఆప్షన్ పెట్టుకోవచ్చని తెలిపారు.

ధర్మపురి ఆలయ హుండీ లెక్కింపు

ధర్మపురి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించగా రూ. 60,87,598 ఆదాయం లభించింది. సెప్టెంబరు 25 నుంచి డిసెంబరు 30 వరకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించారు. అలాగే 55 గ్రాముల మిశ్రమ బంగారం, ఆరు కిలోల 50 గ్రాముల మిశ్రమ వెండి, 27 విదేశీ నోట్లు లభించాయి. కార్యక్ర మంలో దేవాదాయ కరీంనగర్ సహాయ కమిషనర్ ఎస్ సుప్రియ, ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడికి బంగారు పతకాలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన సైక్లిం గ్ క్రీడాకారుడు వంగల హృతికేష్ రాష్ట్రస్థాయి సీఎం కప్ సైక్లింగ్ పోటీల్లో రెండు బంగారు పతకాలను సాధించాడు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న హృతికేష్ మాస్ స్టార్ట్, టైం ట్రైల్స్ విభాగాల్లో విశేష ప్రతిభ చాటి పతకాలను సాధించాడు. హృతికేష్‌ను కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ వై సునీల్‌రావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్ అభినందించారు.

ఢిల్లీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపిక


రుచితను అభినందిస్తున్న వీసీ

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ జి.రుచిత జనవరి 26న ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థిని రుచితను శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌ఉమేష్‌కుమార్ అభినందించారు.

గడిచిన కాలానికి అక్షర రూపం..



● జ్ఞాపకాలను పదిల పరుస్తున్న డైరీ

డైరీ మన జీవన అడుగుజాడలను పదిలపరుస్తుంది. గడిచిపోయినకాలంలో మన ఆలోచనలను అక్షరాల రూపంలో గుర్తు చేస్తుంది. కొత్త సంవత్సరానికి ప్రొగ్రెస్ రిపోర్ట్ అందిస్తుంది. పాత సంవత్సరంలో నిర్దేశించుంకున్న లక్ష్యాలు, సంకల్పాలు సాధించిన విజయాలు, ఓటములను జ్ఞాపకం చేస్తుంది. 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ మన ఆలోచనలకు అద్దం పట్టే విధంగా 2025లో డైరీ రాయడానికి అలవాటు పడుదాం.

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అక్షరాలను ఇలా మొదలు పెడదాం

మార్కెట్‌లోకి అందమైన రంగు రంగుల డైరీలు అందుబాటులో ఉన్నాయి. ఇష్టమైన రంగులతో అనువైన సైజుల్లో ఉండే డైరీని కొనుగోలు చేయాలి. ఆ డైరీ మీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఉండాలి. మొదటి పేజీలో మీ వివరాలు రాసుకోవాలి. డైరీ రాయడం కోసం ప్రతీరోజు ఒక నిర్ధిష్టమైన సమయాన్ని ఏర్పాటు చేసుకోవడం మంచిది. చాలా మంది ఏం రాయాలో తోచక ప్రారంభించిన వారం రోజులకే ముగిస్తారు. కొందరు చిట్టాపద్దులు, వడ్డీ లెక్కలకు పరిమితం చేస్తారు. ప్రతీ రోజు ఎక్కడ ఉన్నారు? ఏ సమయంలో ఉన్నారు? ఎదురైన అనుభూతులు వంటివి డైరీలో రాసుకోవాలి. జీవన ప్రయాణానికి దిక్సూచిగా భావించి భద్రపర్చుకోవాలి.

మార్గదర్శిగా..

యువతీ, యువకులు డైరీ మార్గదర్శిగా నిలుస్తుంది. నిర్దేశించుకున్న లక్ష్యాలు, సాకారమైన కలలను డైరీలో రాసుకోవాలి. కళాశాలల్లోని సరదా సంఘటనలతోపాటు గత సంవత్సరం విఫలమైన అంశాలను రాసుకొని ఈ ఏడాది లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. ఆత్మీయులు, స్నేహితులతో పంచుకున్న అనుభూతులను పొందుపర్చుకోవాలి.

సెలవుల్లో నానమ్మ, అమ్మమ్మ ఊర్లకు వెళ్లినా, పర్యాటక కేంద్రాలకు వెళ్లినా జ్ఞాపకాలను పదిల పర్చుకోవాలి. దంపతులు వేరు వేరుగా డైరీలు రాసుకుంటారు. కానీ చిన్నారుల డైరీ ఒకటి ఏర్పాటు చేసి వారి ముచ్చట్లను ఇద్దరు కలిసి రాస్తే సరదాగా ఉంటుంది. పిల్లలు లేచి నిలబడి తొలి అడుగు వేసే నాటి నుంచి వారు ఎదిగే తీరు రాస్తే పెద్దవాళ్లుగా మారిన తరువాత వారికి ఒక తియ్యని అనుభూతిని అందించిన వారవుతారు.

జాగ్రత్తలు పాటించాలి

ఒకరి డైరీ చదవడం సభ్యత కాదని, కుటుంబ సభ్యులతోపాటు సమాజం అంగీకరిస్తున్న వాస్తవం. కానీ ఆ విషయాలను మరిచి కొందరు చదవడానికి ప్రయత్నిస్తారు. డైరీని జాగ్రత్తగా పెట్టుకోవడం మంచిది. డైరీ వ్యక్తిగతమని, ఎవరూ చదవవద్దని హెచ్చరించవచ్చు. కుటుంబ సభ్యులు, ఆత్మీయుల నెగిటివ్ విషయాలు డైరీలో రాయకపోవడం మంచిది. రాయాల్సి వస్తే బాగా ఆలోచించాలి.. భవిష్యత్‌లో గొడవలు వచ్చే అవకాశాలు కూడా లేకపోలేదు. ఎవరికైనా డైరీ దొరికితే ఎట్టి పరిస్థితుల్లో చదవకుండా మొదటి పేజీలోని చిరునామా చూసి పంపించడమో, ఫోన్ చేసి అందించడమో చేయాలి.

గడిచిన క్షణాలు... మళ్లీ ముందుకు



గడచిన క్షణాలు డైరీ మళ్లీ మనముందు ఉంచుతుంది. ప్రతీ రోజు జరిగే సంఘటనలు మనలో కలిగే భావాలు దాచుకోవాలంటే డైరీ అవసరం. మన తప్పు ఒప్పులను సరిచేసుకోవడానికి డైరీ రాసే అలవాటు మంచిది. చిన్నప్పటి నుంచి డైరీ రాస్తాను.

- ఎల్.శారద, ప్రధానోపాధ్యాయిని, సిరిసిల్ల

చిన్నతనం నుంచి అలవాటు



చిన్నతనం నుంచి డైరీ రాయడం అలవాటు. చదువుకునే రోజుల్లో నోటుపుస్తకంలో తేదీలు వేసి రాసుకునేవాళ్లం. 30 ఏళ్లుగా మార్కెట్‌లోకి వస్తున్న రకరకాల డైరీలు కొనుగోలు చేస్తున్నా. రోజువారీ కార్యక్రమాలు, కవితలు, సాహిత్య జ్ఞాపకాలను రాస్తుంటా. చాలా మంది కొత్త సంవత్సరంలో డైరీ రాయాలని కొనుగోలు చేస్తారు. నెల రోజులపాటు బాగానే రాసి ఆ తరువాత మానేస్తారు. డైరీ రాయడం మంచి అలవాటుగా పెట్టుకోవాలి.

- డాక్టర్ కందేపి రాణీప్రసాద్, బాల సాహితీవేత్త

నిజాయితీని తెలిపే దర్పణం



నిజాయితీని తెలిపే దర్పణం డైరీ. ఒంటరిగా కూర్చొని రాసిన పేజీలు కొన్నాళ్లకు ఎన్నో మధుర జ్ఞాపకాలను మనముందు ఉంచుతాయి. మనిషి జీవితంలో దాచుకునేవి. తన భాషతో రాసుకునే ఆనందాల మాట డైరీ. ఈ రోజుల్లో డైరీలు మూగబోతున్నాయి. రాయడం అలవాటు మారిపోతుంది. డైరీ రాయడం ఎంతో ఉపయోగకరం.

- మడూరి అనిత, రచయిత్రి సిరిసిల్ల

జ్ఞాపకాలు పదిల పరుస్తుంది



జ్ఞాపకాలను డైరీ పదిలపరుస్తుంది. వ్యక్తిగత అభిప్రాయాలకు అక్షర రూపం ఇస్తూ డైరీ రాయడం మంచి అలవాటు. సోషల్‌మీడియా ప్రభావంతో పుస్తకాలు చదవడం, డైరీ రాయడం తగ్గిపోతోంది. ఇది వ్యక్తిత్వ వికాసానికి గొడ్డలి పెట్టు. విద్యావంతులు తప్పనిసరిగా ప్రతీరోజు కనీసం అరగంట పుస్తకాలు చదవడం, డైరీ రాయడం అలవాటు చేసుకోవాలి.

- పాకాల శంకర్‌గౌడ్, ఉపాధ్యాయుడు సిరిసిల్ల

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


శ్రీలక్ష్మి

జగిత్యాల అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జగిత్యాలలో జరిగిన సీఎం కప్ బాక్సింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సీహెచ్ శ్రీలక్ష్మి రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు జగిత్యాల గురుకుల విద్యాలయం పీడీ సీహెచ్ రవళి ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి చదువుతున్న శ్రీలక్ష్మి 3వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

పాలకుర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడీనగర్ యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు సీఎం కప్ రాష్ట్ర స్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు సంతోష్ సోమవారం తెలిపారు. ఎన్ ఆదిత్య వర్మ, ఎండి అల్తాఫ్, ఏ శ్రీచరణ్‌చారీ మహబూబ్‌నగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు

● చాంపియన్‌గా కరీంనగర్, ఆదిలాబాద్ జట్లు


చాంపియన్స్‌గా నిలిచిన కరీంనగర్ జిల్లా క్రీడాకారులు

కరీంనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో బాలబాలికల సబ్ జూనియర్స్ చాంపియన్‌గా కరీంనగర్, జిల్లా కేడెట్ చాంపియన్‌గా ఆదిలాబాద్ జిల్లా జట్లు నిలిచాయి. రెండు రోజులుగా జూడో సంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జరిగిన 9వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్, కేడెట్ బాలబాలికల జూడో పోటీలు సోమవారం ముగిశాయి. రెండు విభాగాల్లో జరిగిన పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 20 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు, 100 మంది కోచ్‌లు, మేనేజర్లు, రెఫరీలు హాజరయ్యారు. సబ్ జూనియర్స్, కేడెట్ విభాగాల్లో మహబూబ్‌నగర్ జిల్లా రన్నరప్‌గా నిలిచింది. సబ్ జూనియర్స్ విభాగంలో ఆదిలాబాద్, కేడెట్ విభాగంలో కరీంనగర్ జిల్లాలు తృతీయ చాంపియన్‌గా నిలిచాయి. పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు తెలంగాణ జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి తెలిపారు. జాతీయస్థాయి జూడో పోటీల్లో పాల్గొనే తెలంగాణ సబ్ జూనియర్, కేడెట్ జట్లు ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్ కైవసం చేసుకోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్, తెలంగాణ జూడో సంఘం ఉపాధ్యక్షులు కదారి అనంతరెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం విజేతలుగా నిలిచిన వారికి చాంపియన్‌షిప్ ట్రోఫీలను ప్రదానం చేశారు.

పెండింగ్ బిల్లులు రాక ఇబ్బందులు

● మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్

భగత్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో రోడ్డున పడ్డామని తాజా మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కినపల్లి కరుణాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మాజీ సర్పంచులు కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాజీ సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు జోగు లక్ష్మీరాజ్యం సాగర్, కనవేన శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి తాడేపు ఎల్లం, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌ఛార్జి సిరికొండ శ్రీనివాస్, జగిత్యాల కన్వీనర్ ఏలేటి నర్సింహారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, కరండ్ల మధూకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంకణాల విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలుగులోకి చారిత్రక ఆనవాళ్లు


గుహలో దేవతా శిల్పం


వినాయక విగ్రహం

తిమ్మాపూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిళిపాలెం గ్రామంలో గల శ్రీ చెన్న కేశవస్వామి ఆలయం గుట్టపై పురాతన కాలం నాటి ఆనవాళ్లు, చారిత్రక కట్టడాలు వెలుగు చూస్తున్నాయి. ఈ ఆలయాన్ని దేవుని గుట్ట అని కూడా పిలుస్తారు. ఇక్కడి శివకేశవ దేవాలయాలు ప్రాచీనమైనవి. దీని నేపథ్యం తెలుసుకునేందుకు గుట్ట పరిసరాలను (చరిత్ర పరిశోధకులు) డిస్కవరి మ్యాన్ రెడ్డి రత్నకర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు అసక్తికర విషయాలను తెలిపారు. ఈ గుట్ట 13వ శతాబ్దానికి చెందిన కాకతీయ పాలకుల కాలంలో నిర్మించిన ఆలయంగా తెలిపారు. గుట్టపై పురాతన కాలం పనిముట్ల పరిశ్రమ అనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ గుట్టను పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దుకోవడానికి అవకాశాలు ఉన్నాయన్నారు.

'ఎల్లంపల్లి' భూముల పరిరక్షణకు చర్యలు

● అక్రమ చేపల చెరువులకు అడ్డుకట్ట ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

అంతర్గాం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి ప్రాజెక్టు భూముల పరిరక్షణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రాజెక్టు భూముల్లో అక్రమంగా చెరువులు ఏర్పాటు చేసిన వ్యక్తులపై చర్యలకు సమాయత్తం అవుతున్నారు. ఇటీవల ఎల్లంపల్లి ప్రాజెక్టు భూముల కబ్జా పేరిట 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఎల్లంపల్లి అధికారులు స్పందించారు. గత కొన్ని సంవత్సరాలుగా కొందరు అక్రమార్కులు ప్రాజెక్టును ఆనుకొని ఉన్న భూములను సదరు రైతుల నుంచి లీజుకు తీసుకోవడంతో పాటు పెద్ద ఎత్తున ప్రాజెక్ట్ భూముల్లో చెరువులను ఏర్పాటు చేసి చేపల పెంపకం చేపడుతున్నారు. చెరువుల్లో నీటి అవసరాల కోసం ప్రాజెక్ట్‌లో పంప్ మోటార్లు ఏర్పరచుకొని నీటిని వాడుకుంటున్నారు. అలాగే సమీపంలోగల ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా అక్రమంగా విద్యుత్తును వినియోగించుకుంటున్నా ఇన్ని రోజులుగా అటు ఎల్లంపల్లి అధికారులు కానీ, విద్యుత్ శాఖ అధికారులు కానీ స్పందించకపోవడంపై స్థానిక ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చేపల చెరువుల ఏర్పాటుతో ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి మట్టం కొలతలపై ప్రభావం చూపనున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. అక్రమంగా


ఎల్లంపల్లి భూముల్లోని చెరువులను పరిశీలిస్తున్న అధికారులు

ఏర్పాటు చేసిన చేపల చెరువులను తొలగించి ఎల్లంపల్లి ప్రాజెక్టు భూములను పరిరక్షించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ నేపథ్యం ఎల్లంపల్లి అధికారులు చెరువుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అంతర్గాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎల్లంపల్లి ఈఈ స్వామి తెలిపారు. అదే విధంగా అక్రమంగా విద్యుత్‌ను వాడుకుంటున్న చెరువుల నిర్వాహకులపై చర్యలు తీసుకొని కనెక్షన్‌లు తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులను, ప్రాజెక్ట్ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ మండల తహసీల్దార్‌ను శాఖాపరంగా కోరినట్లు ఈఈ స్వామి తెలిపారు.

ప్రాజెక్ట్ భూముల కబ్జాపై కఠిన చర్యలు

- గదరాజు స్వామి, ఈఈ



ఎల్లంపల్లి ప్రాజెక్టు భూముల కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలకు సిద్ధమయ్యాం. చేపల చెరువుల ఏర్పాటుకు ప్రాజెక్ట్ భూములను కబ్జా చేసిన విషయమై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కబ్జాదారులు ఎవరైనా ఉపేక్షించేది లేదు. రెవెన్యూ అధికారులు సహకారంతో ప్రాజెక్ట్ భూములకు హద్దులు ఏర్పాటు చేసి ఇకముందు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.

రేకుర్తి కంటి ఆసుపత్రిలో నగదు రహిత సేవలు

భగత్‌నగర్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మడేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో జనవరి 1 నుంచి నగదు రహిత సేవలు అందుబాటులోకి రానున్నాయని ఆసుపత్రి చైర్మన్ కొండవేణుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రిలో జరిగే కాటరాక్ట్ ఆపరేషన్లు, కంటి సంబంధించిన వ్యాధులకు నగదు రహిత సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఇన్సురెన్స్ కలిగి ఆపరేషన్ చేయించుకునే వారు ముందు రోజు కాని, అదే రోజు కాని ఉదయం 9 గంటలకు ఆసుపత్రి సిబ్బందిని సంప్రదించాలన్నారు. రెటీనా, గ్లకోమా సేవలకు కూడా క్యాష్‌లెస్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

తెలంగాణ చేనేత ఐక్య వేదిక కోశాధికారిగా శారద

కరీంనగర్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మహిళా కోశాధికారిగా కరీంనగర్‌కు చెందిన భీమనాతి శారదను నియమించారు. ఈ మేరకు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేయాలని, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషిచేయాలని, చేనేత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

రాజన్న ఆలయానికి అమావాస్య ఎఫెక్ట్


భక్తులు లేక వెలవెలబోతున్న వేములవాడ రాజన్న ఆలయం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య ఎఫెక్ట్ కనిపించింది. నిత్యం భక్తుల రద్దీతో కిటకిటలాడిన రాజన్న ఆలయం సోమవారం అమావాస్య సందర్భంగా భక్తులు లేక వెలవెల బోయింది. అమావాస్య సందర్భంగా అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం భక్తులు రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని తిరుగు ప్రయాణం అయ్యారు.

- వేములవాడ కల్చరల్, ఆంధ్రజ్యోతి

ధర్మపురిలో పూజలు


సోమవతి అమావాస్య పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ధర్మపురి క్షేత్రంలో సోమవతి అమావాస్య పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. క్షేత్ర సమీపంలో గల శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి,శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాల ఆవరణలో గల రావి చెట్టు వద్ద ముత్తైదువలు సౌభాగ్యం కోసం సోమవతి వ్రతాలు ఆచరించారు. అనంతరం స్వామివారలను దర్శనం చేసుకున్నారు.

- ధర్మపురి, ఆంధ్రజ్యోతి

అబ్బురపరుస్తున్న చిత్రాలు

● చిత్రలేఖనం, త్రీడీ పెయింటింగ్‌లో యువకుడి ప్రతిభ ● సబ్బు బిళ్లలు, కోడిగుడ్లు, పెన్సిల్, గోడలపై బొమ్మలు


గణేష్ విగ్రహానికి కలర్ మిక్సింగ్ చేస్తున్న బండారి సురేష్

వేములవాడ కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్ర లేఖనంతోపాటు త్రీడీ పేయింటింగ్‌తో ఊహకు ప్రాణం పోస్తు న్నాడు వేములవాడ మండలం సంకెపల్లి గ్రామానికి చెందిన బండారి సురేష్. సంకెపల్లికి చెందిన సురేష్‌కు చిన్నతనం నుంచి చిత్రలేఖనంపై ఆసక్తి. దేవతామూర్తుల చిత్రపటాలను అనుసరిస్తూ పలకలపై చిత్రాలను గీసేవాడు. ఇంటర్ చదు వుతున్న సమయంలో సిరిసిల్లకు చెందిన వంగళ గణేష్ అనే కళాకారుడి వద్ద మెళకువలు నేర్చుకు న్నాడు. అనంతరం ఎల్లమ్మ, బీరప్పా, పోచమ్మ ఆలయాల్లోని విగ్రహాలకు రంగులు వేస్తూ, గోడలకు చిత్రాలను గీస్తూ గుర్తింపు పొందాడు. దేవా లయాల్లోని విగ్రహాలకు కలర్ మిక్సింగ్ చేయడంతో పాటు గోడలకు దేవతమూర్తుల చిత్రాలను గీయడంలో సురేష్ దిట్ట. ఊహలకు రూపం తీసుకురావడంతో పాటు ఫొటో చూసి ఉన్న ది ఉన్నట్టుగా గీస్తాడు. రావి ఆకులపై దేశ నేతల చిత్రాలను, బియ్యపు గింజలు, సుద్ద ముక్కులపై బొమ్మలు గీసి అబ్బుర పరిచాడు. కోడిగుడ్లపైన తెలంగాణ తల్లి చిత్రాన్ని గీశాడు. మాజీ మంత్రి కేటీఆర్, ప్రస్తుత కేంద్ర సహాయ మంత్రి బండి సంజ య్‌కుమార్ చిత్రపటాలను గీసి ప్రశంసలు అందుకున్నాడు.


ఇంట్లో గోడపై సురేష్ వేసిన త్రీడీ పెయింటింగ్

త్రీడీ పెయింటింగ్‌తో ఉపాధి

ఇళ్లలోని గోడలపై త్రీడీ పేయింటింగ్ వేస్తూ సురేష్ ఉపాధి పొందుతున్నాడు. ప్రస్తుతం నూతన ఇంటి నిర్మాణం చేపడు తున్నవారు ఇళ్లలో గోడలకు త్రీడీ స్టిక్కర్లను అంటిస్తున్నారు. వాటి కోసం వేలల్లో ఖర్చు చేస్తున్నారు. దీన్ని గుర్తించిన సురేష్ త్రీడీ డిజన్లలో రాణించాలనుకున్నాడు. ప్రత్యేక శిక్షణ పొంది ఇళ్లలోని గోడలపై తక్కువ ఖర్చుతో త్రీడీ చిత్రాలను గీస్తున్నాడు.


సురేష్ గీసిన చిత్రం

చిన్నతనం నుంచి బొమ్మలు గీయడం ఆసక్తి

చిన్న తనం నుంచి బొమ్మలు గీయడం ఆసక్తి. మొదట్లో చిత్రాలను గీసేవాడిని. ఇంటర్ తరువాత ఆర్ట్‌నే ఉపాధిగా మలుచుకోవాలనుకున్నాను. మా గురువు గణేష్ వద్ద మెళకువలను నేర్చుకున్నా. చాలా మంది ఫొటోలు పంపి పెన్సిల్‌తో గీయమంటారు. ఉచి తంగా చిత్రాలను గీసి ఇచ్చేవాడిని. అనంతరం దేవాలయాల గోడలపై చిత్రాలు వేశాను. ఇళ్లలో త్రీడీపేయింటింగ్‌కు డిమాండ్ ఉండడంతో మెళకువల నేర్చుకొని రాణిస్తా.

- బండారి సురేష్, ఆర్టిస్ట్, సంకెపల్లి, వేములవాడ.

కాలువలు ఇలా.. సాగునీరందేదెలా..?

- అస్తవ్యస్తంగా ఎస్సారెస్పీ కాలువలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- రైతులకు తప్పని సాగునీటి కష్టాలు



పదుకాపూర్ గ్రామశివారులో ముళ్లపొదలతో నిండిపోయిన 9ఆర్ కెనాల్

జూలపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ఎస్సారెస్పీ కాలువలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ప్రధాన ఎస్సారెస్పీ డి83 కాలువ ఉపకాలువ 9ఆర్, దాని అనుబంధ ఉపకాలువలు ముళ్లపొదలతో నిండిపోయి ఉన్నాయి. ఈ కాలువల ద్వారా నీరు విడుదలైనప్పటికీ తమ భూముల్లోకి చేరే పరిస్థితి లేకుండాపోయిందని మండల ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సాగునీటి కాలువలు అధ్వానంగా మారాయని రైతులు ఆరోపిస్తున్నారు. తమకు సకాలంలో సాగునీరు అందించకపోతే వేసిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వారబందీ ఆన్‌ఆఫ్ పద్ధతిలో సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టు రైతుల చివరి భూములకు సాగునీరందే విధంగా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం లేదు. దీంతో కాలువల్లో నిండి ఉన్న ముళ్లపొదలతో సాగునీరు వృథా అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా ఆయకట్టు చివరి భూములకు నీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో రైతులు సాగుచేసిన పత్తి పంటలు చివరిదశకు చేరుకున్నాయి. వాటి స్థానంలో మొక్కజొన్న పంటలను సాగుచేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. దీంతో మండలంలో మొక్కజొన్న సాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. అలాగే వరి పంట సాగును కూడా రైతులు ముమ్మరంగా చేస్తున్నారు. వ్యవసాయ బావులు ఉన్న రైతులు ఇప్పటికే నార్లు పోసుకుని నాట్లు వేందుకు సిద్ధమవుతున్నారు. ఎస్సారెస్పీ సాగునీటిపై ఆధారపడిన రైతులు నారు పోసుకునేందుకు సాగునీరు అందక తంటాలు పడుతున్నారు. ఇప్పటికైనా ఎస్సార్ఎస్పీ అధికారులు స్పందించి ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

చెత్త, ముళ్లపొదలను తొలగించాలి

- మెండే రాజన్న, రైతు, జూలపల్లి



ఎస్సారెస్పీ ఉప కాలువల్లో చెత్త, ముళ్లపొదలు నిండిపోయాయి. దీంతో సాగునీరు ఆయకట్టు చివరి భూములకు చేరకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. ఎస్సారెస్పీ సాగునీటి కాలువలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికా రులు పర్యవేక్షించాలి. కాలువల్లోని పూడికను, ముళ్లపొదలను తొలగిస్తే రైతులకు సకాలంలో సాగునీరు అంది పంటలు పండుతాయి. లేకుంటే వారిబందీలో పద్ధతిలో వచ్చే నీరు అందక పంటు ఎండిపోతాయి. ఈ విషయమై అధికారులు దృష్టి సారించాలి.

న్యూస్ బాక్స్

ఆస్తిపన్ను బకాయిదారుల జాబితా విడుదల

కోల్‌సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 2024-25 ఆస్తి పన్ను రూ.1.5లక్షలకు పైగా బకాయి ఉన్న బకాయిదారుల జాబితాను సోమవారం కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ విడుదల చేశారు. ఈ బకాయిలను డిసెంబర్ 31వ తేదిలోగా చెల్లించాలని కమిషనర్ తెలిపారు.

ట్రైనీ అభ్యర్థులకు శిక్షణ

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన మేనేజ్‌మెంట్ ట్రైనీ అభ్యర్థులకు శిక్షణా తరగతులు సోమవారం ఆర్జీ-2 ఏరియాలోని నిమ్ శిక్షణా కేంద్రంలో ప్రారంభమయ్యాయి. జీఎం బండి వెంకటయ్య శిక్షణా తరగతులను ప్రారంభించారు. రెండు వారాల పాటు జరగనున్న శిక్షణ తరగతులకు 29 మంది ట్రైనీలు(మైనింగ్), ఇద్దరు జియాలజీ ట్రైనీలు హాజరయ్యారు. నిమ్ డీజీఎం ఎస్టీఎం హుస్సేనీ, సింటార్స్ డీజీఎం విజయ్‌కుమార్, ఐఈ డీజీఎం మురళీకృష్ణ, ఎస్ఎస్ఓ మహమ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

మంథని, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ స్టేట్ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో మండలస్థాయి పోటీలు నిర్వహించగా, పలువురు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు బిరుదు మధుసూదన్, మండల కన్వీనర్ సీహెచ్. పోచయ్య, ఇంచార్జి హెచ్‌ఎం లక్ష్మీలు సోమవారం తెలిపారు. విద్యార్థులు లక్ష్మీప్రసన్న, ఓల్లాల నవ్యశ్రీ, సాత్విక్‌రాజ్, సాత్విక, భార్గవి, లక్ష్మీప్రసన్న, శ్రీనిత్యలు జనవరి 4న పెద్దపల్లిలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనటానికి అర్హత సాధించారన్నారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం నిర్వహించిన సాంఘికశాస్త్ర మండలస్థాయి సామర్థ్య పోటీలో కనగర్తి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలను ఎంఈఓ రమేష్ అభినందించారు. కార్యక్రమంలో రజాక్, అశోక్, వంశీ పాల్గొన్నారు.

అక్రమ పట్టాను రద్దుచేయాలి

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల క్రితం తాను కొనుగోలు చేసిన భూమిని ఇతరులకు రెవెన్యూ అధికారులు అక్రమంగా పట్టా చేశారని, తన భూమిని తనకే ఇప్పించాలని సోమవారం మండల కేంద్రానికి చెందిన ఇనుగాల రాములు విలేకరుల ముందు గోడు వెళ్లబోసుకున్నాడు. పదేళ్ల క్రితం గ్రామానికి చెందిన వేనిశెట్టి రమేష్ వద్ద సర్వే నంబర్ 169/ఏబీసీ, 167/ఏ, ఏ/1లోని 3.36గుంటలు భూమి కొనుగోలు చేశానని, అప్పటినుంచి రమేష్ భూమిని తన పేరుమీద పట్టా చేయలేదని రాములు వాపోయాడు. దళిత సంఘాల నాయకలు అంబాల రాజేందర్, జూపాక ఉమామహేశ్వర్, తదితరులు ఉన్నారు.

నారాయణపల్లిలో చోరీ

ఎలిగేడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపల్లిలో వృద్ధురాలిపై గుర్తుతెలియని దాడిచేసిన వ్యక్తులు 3 తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. ఈనెల27న మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు అక్కేపల్లి లక్ష్మి(70)పై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేశారు. వృద్ధురాలి మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కువెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న జూలపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకని, వేలిముద్రలు, డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు జూలపల్లి పోలీసులు తెలిపారు.

రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో తగ్గిన నేరాలు

- వార్షిక నేర నివేదికలో సీపీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది నేరాల సంఖ్య తగ్గిందని సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో పటిష్టమైన పోలీసింగే ఇందుకు కారణమన్నారు. సోమవారం కమిషనరేట్‌లో ఆయన వార్షిక నేర నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనరేట్‌లో 2023తో పోల్చితే నమోదైన కేసు సంఖ్య 1257తగ్గిందన్నారు. గత ఏడాది 9424ఉంటే, ఈ ఏడాది 8167గా ఉందన్నారు. అలాగే హత్యలు కూడా 46 నుంచి 33కు తగ్గాయన్నారు. చీటింగ్ కేసులు కూడా 743 నుంచి 594కు తగ్గినట్టు పేర్కొన్నారు. దోపిడీ, దొంగతనాలు కూడా అదుపులోకి వచ్చాయని, పోలీస్ పెట్రోలింగ్‌లు,రాత్రిపూట గస్తీ, సత్ఫలితాలనిచ్చిందన్నారు. కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో గత ఏడాది రూ.4.16 కోట్లు ప్రాపర్టీ పోగా ఈ ఏడాది 5.82కోట్ల ప్రాపర్టీ పోయిందన్నారు. కానీ రికవరీ మాత్రం 10శాతం పెరిగిందన్నారు. గత ఏడాది 23శాతం ఉంటే ఈ ఏడాది 33.39 శాతంగా ఉందన్నారు. కమిషనరేట్‌లో ఈ చలాన్‌కు సంబంధించి 5,05,636కేసులు నమోదు అయితే రూ.12.23 కోట్లు జరిమానా విధించామన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌కు సంబంధించి 12779కేసులు నమోదు అయితే రూ.76.99లక్షలు జరిమానా విధించినట్టు పేర్కొన్నారు. డ్రంకెన్ డ్రైవ్, తనిఖీల వల్ల రోడ్డు సేఫ్టీ పెరిగిందని, దీని వల్ల కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల కేసులు కూడా తగ్గాయన్నారు. 755రోడ్డు ప్రమాదాలు జరిగితే అందులో 263 మంది మరణించారని, 810మందికి గాయాలయ్యాయన్నారు. గ్యాంబ్లింగ్‌కు సంబంధించి 928మందిపై కేసులు నమోదు రూ.77.25లక్షలు సీజ్ చేశామన్నారు. గంజాయికి సంబంధించి 237మందిపై కేసులు నమోదు 51.23 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. నకిలీ సీడ్స్‌కు సంబంధించి ఉక్కుపాదం మోపామని, కర్ణాటక వరకు వెళ్లి రవాణాదారులపై నిఘా పెట్టి పట్టుకున్నామన్నారు. కమిషనరేట్‌లో ఆపరేషన్ గరుడ సత్ఫలితాలనిస్తుందని, దీనిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా అభినందించారన్నారు. పెద్దపల్లి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి కమిషనరేట్ అంతా విస్తరింపచేయాలని, అందుకు నిధులు ఇప్పిస్తామని చెప్పారన్నారు. ఈ గరుడ ఆపరేషన్‌లో పోలీసులకంటే ముందే గొడవలు జరిగే ప్రాంతాలకు డ్రోన్లు వెళతాయని, అక్కడి పరిస్థితులను చిత్రీకరిస్తాయన్నారు. తద్వారా నేరాల నియంత్రణ కూడా సాధ్యమవుతాయన్నారు. అలాగే మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణకు కూడా డ్రోన్ పెట్రోలింగ్ నిర్వహించామని, ఫలితాలను సాధించామన్నారు. పది పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ డ్రోన్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి నియంత్రణకు నిరంతర నిఘా కొనసాగుతుందని, పాత నేరస్థుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామన్నారు. కమిషనరేట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించామని, ఎన్నికల సందర్భంగా రూ.1.79కోట్ల సొమ్మును సీజ్ చేశామన్నారు. కమిషనరేట్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించామని, 116ఘటనల్లో 255మందిపై కేసులు నమోదు చేసి 182వాహనాలను సీజ్ చేశామని, రూ.17.78లక్షల విలువైన ఇసుకను స్వాధీనం చేసుకున్నామన్నారు. కమిషనరేట్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే 208 మందిపై హిస్టరీ షీట్లు తెరిచామని, అందులో 50మందిపై రౌడీషీట్లు, 158మందిపై సస్పెక్ట్ షీట్లు తెరిచామన్నారు. పీడీ యాక్టు నిబంధనలు కఠినతరం కావడం వల్ల ఒకరిపై మాత్రమే పీడీ యాక్టు నమోదు చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీకి సంబంధించి 140కేసులు నమోదు కాగా 102కేసుల్లో చార్జిషీట్లు వేసి రూ.12.75లక్షలు నష్టపరిహారం ఇప్పించామన్నారు. లోక్ అదాలత్‌లో 42762పీటీ, కాంపౌండబుల్ కేసులను పరిష్కరించామన్నారు. సీసీ కెమెరాలకు సంబంధించి ప్రజలు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతోనే నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లు ఉన్న పట్టణాల్లో నిర్వహణ స్థానిక సంస్థలే చేపట్టాల్సి ఉందని, ఈ మేరకు లేఖలు రాశామన్నారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ

ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా సైబర్ నేరస్థుల బారిన పడకుండా నియంత్రించుకోవచ్చని సీపీ తెలిపారు. సెల్‌ఫోన్ వినియోగాల్లో జాగ్రత్తలు వహించాలన్నారు.సాధ్యమైనంత వరకు ప్రజలు తమ బ్యాంకు అకౌంట్లలో పెద్ద ఎత్తున నిల్వలు ఉంచుకోవద్దని, అవసరమైన మేర ఉంచుకొని మిగతాది ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసుకోవాలన్నారు. గత ఏడాది సైబర్ క్రైమ్‌కు సంబంధించి 281కేసులు నమోదయ్యాయని, రూ.5.02 కోట్లు ప్రజలు నష్టపోయారన్నారు.

33శాతం కేసుల్లో శిక్షలు

రామగుండం కమిషనరేట్ పరిధిలో కేసులు నమోదు చేయడంతో పాటు నేరస్థులకు శిక్షలు వేయించడంలో కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. 36శాతం కేసుల్లో దోషులకు శిక్షలు పడ్డాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శిక్షల రేటు 33శాతం ఉంటే కమిషనరేట్‌లో 36శాతం ఉందన్నారు. ఈఏడాది ముగ్గురికి యావజ్జీవ శిక్షలు పడగా ఆరుగురికి పదేళ్లు, ఐదుగురికి ఐదు సంవత్సరాలు, నాలుగేళ్లు ఒకరికి, రెండేళ్లు 11మందికి పడ్డాయన్నారు. ఏడాదిలోపు శిక్షలు పడ్డవారు 35మంది ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, గోదావరిఖని ఏసీపీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏఆర్ ఏసీపీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో సింగరేణి వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా సింగరేణి యాజమాన్యం సోమవారం పెంచికల్‌పేట్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఏరియా ఎస్వోటూ జీఎం రాములు వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వకీల్‌పల్లె గని ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని రేమేడియేషన్స్ మేషర్స్ కింద వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, సర్పంచ్ కొండ వెంకటేష్, ఏరియా అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

సుల్తానాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుబ్బపల్లి వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పెద్దపల్లికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై కరీంనగర్ వెళుతుండగా ఓ వ్యాన్ కుడివైపు మళ్లడంతో ఢీకొన్నారు. వారి బైక్ వ్యాన్ కిందకు దూసుకుపోయి గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించారు.

విస్తరణ బాటలో ఎన్టీపీసీ..

(3వ పేజీ తరువాయి)

ప్రాజెక్టును నిర్మించ నుంది. ఎల్‌అండ్‌టీ సంస్థ 176 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును నిర్మిస్తోంది.

● అవార్డుల పంట..

రామగుండం ఎన్టీపీసీకి 2024లో వివిధ విభాగాల్లో అవార్డులు వచ్చాయి. ఈ ఏడాది ఎకనామిక్ టైమ్స్ సంస్థ నుంచి ఎనర్జీ లీడర్‌షిప్ అవార్డులలో రెండు జాతీయస్థాయి అవార్డులు రామగుండం ఎన్టీపీసీకి లభించాయి. ఎనర్జీ కన్జర్వేషన్, పవర్ ఎక్సలెన్స్ విభాగంలో పురస్కారాలు లభించాయి. అలాగే అపెక్స్ ఇండియా అవార్డుల్లో 4 జాతీయస్థాయి అవార్డులు లభించాయి. ఈ ఏడాది నవంబరు 22న గోవాలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఆర్, సేఫ్టీ, ట్రైనింగ్, టెక్నాలజీ ఎక్సలెన్స్ విభాగాల్లో అవార్డులు దక్కాయి. ఈ ఏడాది సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ 2024 అవార్డు రామగుండం ప్రాజెక్టుకు లభించింది. సెప్టెంబరు 12న హైదరాబాద్‌లో జరిగిన పవర్‌ప్లాంట్ సమిట్ కార్యక్రమంలో సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ అవార్డు లభించింది.

క్రీడాసామగ్రి అందజేత

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : హన్మకొండ, హైదరాబాదులలో ఈనెల 31 నుంచి జనవరి 2వ తేదీ వరకు జరిగే సీఎం కప్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుకు సోమవారం స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. స్థానిక పెద్దపల్లి ఎంఆర్సీలో క్రీడాకారులకు జిల్లా పరిషత్ సీఈవో నరేందర్, జిల్లా విద్యాధికారి మాధవి, బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి క్రీడాకారులకు టీషర్ట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొమురోజు శ్రీనివాస్, వేల్పుల సురేందర్, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూఇయర్ వేడుకల్లో శ్రుతిమించితే కఠిన చర్యలు

మంథని, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పోలీసు సబ్ డివిజన్ పరిధిలో జీరో డే సందర్భంగా రాత్రి, న్యూఇయర్ వేడుకల్లో ఎవరైనా శ్రుతి మించేలా ప్రవర్తించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ హెచ్చరిస్తూ సోమవారం ప్రకటన జారీ చేశారు. వేడుకల్లో డీజేలు, ఎక్కువ శబ్దాన్ని ఇచ్చే సౌండ్ సిస్టంను వినియోగించరాదన్నారు. మద్యం సేవించి రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తూ వాహనాలు నడపకూడదన్నారు. మహిళలతో అసభ్యరంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకోవాలని పొత్కపల్లి ఎస్సై రమేష్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు.

● పాలకుర్తి (ఆంధ్రజ్యోతి) : న్యూఇయర్ వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని బసంత్‌నగర్ పోలీసులు సూచించారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ ఆర్ స్వామి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కలెక్టర్‌ను కలిసిన అదనపు జీపీలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు జీపీలు

కోల్‌సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కోర్టుల్లో అదనపు జీపీలుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బీ శంతన్‌కుమార్, కొండు సౌజన్యలు సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్షను పెద్దపల్లిలోని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టులో శంతన్‌కుమార్, గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కొండు సౌజన్యలను ప్రభుత్వం ఏజీపీలుగా నియమించింది. వీరి వెంట గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొటం సతీష్ ఉన్నారు.

అనుమతి లేని పెట్రోల్ బంక్‌కు పెనాల్టీ నోటీసులు

కోల్‌సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో నిర్మాణ అనుమతిలేని మూడు పెట్రోల్ బంక్‌లకు కలెక్టర్ ఆదేశానుసారం పెనాల్టీ నోటీసులు జారీ చేసినట్టు నగరపాలక సంస్థ కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ పేర్కొన్నారు. సంతోషి మాత ఆటో సర్వీస్(ఇండియన్ ఆయిల్)కు రూ.14,78,406, లేపాక్షి ట్రాన్స్‌పోర్ట్(హెచ్‌పీ)కి రూ.38,50,410, ఆర ఫిల్లింగ్ స్టేషన్(అడాక్) రూ.19,36,185జరిమానా విధించినట్టు పేర్కొన్నారు.

సింగరేణి సీఎండీ పదవీకాలం పొడిగింపు

గోదావరిఖని, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి సీఎండీగా బలరాంనాయక్ పదవిని మరో ఏడాది పొడిగిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం బలరాంను సింగరేణి సీఎండీగా కొనసాగించాలని విజ్ఞప్తి చేయడంతో స్పందించిన కేంద్రం బలరాంనాయక్‌ను మరో ఏడాది పాటు సీఎండీగా కొనసాగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు సంవత్సరాలు సింగరేణి డైరెక్టర్(పా)గా పని చేసిన బలరాంనాయక్‌ను ఏడాది క్రితం సీఎండీగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 31న పదవీకాలం ముగుస్తుండడంతో మరో ఏడాది పదవీకాలం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయడంతో బలరాంనాయక్‌కు మరో ఏడాది సింగరేణి సీఎండీగా కొనసాగే అవకాశం కల్పించారు.

ఆర్జీ-1 స్ట్రక్చర్ మీటింగ్

గోదావరిఖని, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 ఏరియాస్థాయి స్ట్రక్చర్ మీటింగ్ గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీతో సోమవారం యాజమాన్యం నిర్వహించింది. జీఎం లలిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై యూనియన్ నాయకులు, అధికారులు చర్చించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరి ఆరెల్లి పోషం, ఎస్ఓటూ జీఎం గోపాల్ సింగ్, ఏజీఎం ఈఎండీవీ రావు, ఎజీయం (ఐఈడీ) ఆంజనేయులు, శివనారాయణ, పీఓ చంద్రశేఖర్, ఏసీఎంఓ కిరణ్ రాజ్‌కుమార్, డీజీఎం(పర్సనల్) కిరణ్ బాబు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఏజెంట్లు చిలుక శ్రీనివాస్, రమేష్, అధికారులు బీమా, జితేందర్‌సింగ్, వరప్రసాద్, వీరారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు సిద్దమల్ల రాజు, మదమ మహేష్, మల్లికార్జున్, వెంకటరెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

సింగరేణి డిస్పెన్సరీలో కార్మికుడి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3కి చెందిన కార్మికుడు సోమవారం మృతిచెందాడు. సెకండ్ షిఫ్టు సమయంలో సామల రామ్మూర్తి అనే ఈపీజీహెచ్ గుండెపోటు వచ్చింది. ప్రాజెక్టు అధికారులు స్థానిక సింగరేణి డిస్పెన్సరీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించే సమయంలో రామ్మూర్తి మృతిచెందాడు. కాగా సమయానికి డిస్పెన్సరీలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో కార్మికుడు మృతిచెందినట్టు కార్మిక సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. వైద్యులు అందుబాటులో ఉంటే రామ్మూర్తి చనిపోయేవాడు కాదని ఏఐటీయూసీ నాయకులు రవీందర్, రాజారత్నం, అన్నారావు పేర్కొన్నారు. పని స్థలంలో అస్వస్థకు గురైన కార్మికుడిని డిస్పెన్సరీకి తరలింపు, చికిత్సలో ప్రాజెక్టు అధికారులు, వైద్య విభాగానికి సమన్వయం కొరవడిందని టీబీజీకేఎస్ ఆర్జీ-2 వైస్‌ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ తెలిపారు.